## సీఎల్ఏటీలో శ్రీజాతవేదకు 363వ ర్యాంకు

నయీంనగర్, డిసెంబర్ 8 : హనుమకొండలోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉండే ఎన్న మనేని శ్రీనివాసరావు, కవిత దంపతుల కుమార్తె శ్రీజాతవేద కామన్ లా అడ్మిషన్ టెస్ట్(సీఎల్ఏటీ)లో ఆలిండియా 363వ ర్యాంకు సాధించింది. దేశ వ్యాప్తంగా 80వేల మంది ఈ పరీక్షకు హాజరయ్యారని, ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

## ఐనవోలులో నేటి నుంచి సుధావలి వర్ణలేపనం

**15 వరకు దర్శనం, ఆర్జిత సేవలు నిలిపిత**

ఐనవోలు, డిసెంబర్ 8 : ఐనవోలు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో ఈ నెల 10వ తేదీ నుంచి ఈ నెల 15 ఆదివారం వరకు మల్లికార్జున స్వామి మూలవిరాట్‌కు సుధాలి వర్ణ లేపనం(రంగులు వేసే) కార్యక్రమం జరుగనుంది. ఈ నేపథ్యంలో స్వామి వారి దర్శనం, ఆర్జిత సేవలు నిలిపి వేయనున్నట్లు ఆలయ ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ నెల 16వ తేదీన దృష్టికుంభం కార్యక్రమం అనంతరం మల్లిఖార్జునస్వామి దర్శనం యథావిధిగా ఉంటుందని వివరించారు. భక్తుల సౌకర్యార్థం 5 రోజుల పాటు ఉత్సవ మూర్తుల దర్శనం మాత్రమే ఉంటుందని ఉప ముఖ్య అర్చకుడు పాతర్లపాటి రవీందర్ పేర్కొన్నారు.

## క్రికెట్ జిల్లా జట్టు ఎంపికలు

నయీంనగర్, డిసెంబర్ 8 : హైదరాబాద్‌లో జరుగనున్న అండర్-14 పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల10న హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీస్ సుఖాంత్ క్రీడా మైదానంలో నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 1 సెప్టెంబర్ 2010 నుంచి 31 ఆగస్టు 2012 మధ్య జన్మించిన వారు అర్హులని, క్రీడాకారులు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, బోనోఫైడ్, ఆధార్‌కార్డుతో పాటు సొంత క్రికెట్ కిట్‌తో సెలెక్షన్‌కు రావాలని కోరారు. సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా పుల్లూరి శ్రీనివాస్, మెంబర్‌గా అప్జల్, రామకృష్ణ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

శాంత(ఫైల్)

ఆత్మకూరు, డిసెంబర్ 8 : ఆత్మకూరుకు చెందిన బయ్య శాంత (55) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై పర మేశ్వర్ తెలిపారు. ఈ నెల 7వ తేదీన గూడెప్పాడ్ క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టగా, శాంతకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

SKY ASSOCIATES- WANTED
★Area collection executives, Telecallers, Experience is not required Locations: warangal, Narsampet, wardhannapeta, thorrur, parkal, mulugu, Ghanpur, -Cont 9491465729
NTW-332306

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# కుక్కలు.. బాబోయ్ కుక్కలు

- గ్రేటర్‌లో 30 వేల వీధి శునకాలు
- ఏడాదికి కోట్లలో ఖర్చు
- అయినా తప్పని కుక్క కాట్లు

వరంగల్‌లోని కరీమాబాద్ ప్రాంతంలో రోడ్లపై కుక్కల గుంపు

హనుమకొండ ప్రాంతంలో రోడ్లపై మందలుగా తిరుగుతున్న వీధి కుక్కలు

వరంగల్, డిసెంబర్ 8 : నగర రోడ్లపై వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డెక్కెందుకు నగరవాసులు వణికిపోతున్నారు. ఏ గల్లీలో చూసినా కుక్కల మందలే కనిపిస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు కుక్కలు వదిలిపెట్టడం లేదు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో 30వేల వీధి కుక్కలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి కుక్కల సంఖ్య తగ్గించేందుకు కార్పొరేషన్ అధికారులు ప్రతి ఏడాది సుమారు రూ.10 నుంచి 13 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయినా నగరంలో వీధి కుక్కల సంఖ్య తగ్గడం లేదు. 30 వేల కుక్కల్లో ఏడాదిలో కేవలం 30 శాతం కుక్కలకే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. మిగతా కుక్కలు సంతానోత్పత్తి చేస్తున్నాయి. దీంతో వాటి సంఖ్య తగ్గడం లేదు.

**ఏడాదికి కోట్లలో ఖర్చు..**

వీధి కుక్కలకు కుటుంబ నియంత్ర ఆపరేషన్ల కోసం బల్దియా అధికారులు కోట్లలో ఖర్చు చేస్తున్నారు. కుక్కల పట్టివేత, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వ్యాక్సిన్స్, ఆహారం అందించడాన్ని బల్దియా అధికారులు ప్రైవేట్ ఏజెన్సీకి ఇచ్చారు. వీధి కుక్కలను పట్టి ఆపరేషన్ చేసిన మూడు రోజుల తర్వాత దాన్ని ఎక్కడ నుంచి తీసుకువచ్చారో అక్కడే వదిలి వేయాలి. అలా చేస్తే ఒక వీధి కుక్కకు రూ. 1,350 చెల్లిస్తున్నారు. గ్రేటర్‌లో సుమారు 30 వేల వీధి కుక్కల్లో ఏడాదిలో సుమారు 10 వేల కుక్కలను పట్టి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. ఒకే సంవత్సరంలో గ్రేటర్‌లోని వీధి కుక్కలన్నింటికీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంలో విఫలం అవుతుండడంతో ప్రతి ఏడాదికి కుక్కల సంఖ్య పెరిగిపోతున్నది.

**రోడ్లపై స్వైర విహారం..**

నగర రోడ్లపై కుక్కలు మందలు మందలుగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్డెక్కెందుకు భయపడుతున్నారు. ముఖ్యంగా చలికాలంలో కుక్కలు జనం మీద ఎక్కువగా దాడులు చేస్తుంటాయి. స్కూల్‌కు వెళ్లే పిల్లలు కనిపిస్తే వెంటాడి దాడి చేస్తున్నాయి. రాత్రి సమయంలో కుక్కల అరుపులకు నిద్రాభంగంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా పరిధిలో ఎక్కడో ఒక చోట కుక్కల దాడిలో జనం గాయపడుతూనే ఉన్నారు. కుక్కల నియంత్రణకు బల్దియా కోట్లు ఖర్చు చేస్తున్నా బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. ఇటీవల నగరంలోని అనేక ప్రాంతాల్లో చిన్నారులపై కుక్కల దాడులు చేసిన ఘటనలు వెలుగు చూస్తున్నాయి. మూగ జీవులను చంపొద్దని కోర్టు ఆదేశాలు ఉండడంతో బల్దియా అధికారులు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతోనే సరిపెట్టుకుంటున్నారు. ఏ ప్రాంతం నుంచి తీసుకెళ్లారో మళ్లీ అక్కడే వదిలి వేయాలన్న నిబంధనతో ఆపరేషన్ల తర్వాత అక్కడే వదిలి వేస్తున్నారు. కోర్టు అదేశాలతో తామేమి చేయలేమని బల్దియా అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రతి ఏడాది కోట్లు ఖర్చు చేస్తున్నా కుక్కల బెడద నుంచి విముక్తి కలుగడం లేదని నగర ప్రజలు వాపోతున్నారు.

## కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

మృతి చెందిన గొర్రె పిల్లలు

శాయంపేట, డిసెంబర్ 8 : కుక్కలు దాడి చేయడంతో గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన పెద్దకోడెపాక గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన భిక్షపతి ఇంటి దగ్గర చిన్న గొర్రె పిల్లలను వదిలి మిగిలిన గొర్రెలను మేపేందుకు తీసుకెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి ముందున్న పది గొర్రె పిల్లలను కుక్కలు చంపివేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరాడు.

## పండ్ల షాపుల్లో దొంగతనాలు

నయీంనగర్, డిసెంబర్ 8 : హనుమకొండ, కాజీపేట పోలీసు స్టేషన్ల పరిధిలో రోడ్ల పక్కన ఉన్న పండ్ల షాపుల్లో ఆరు నెలలుగా కొందరు వ్యక్తులు దొంగతనాలు చేసి పండ్ల యజమానులకు నిద్రలేకుండా చేస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నిర్లక్ష్యంగా ఉండడంతో అదే అదనుగా భావించి దొంగతనాలు చేస్తున్నట్లు పలువురు తెలిపారు. రాత్రి సమయంలో పోలీసులు తమ డ్యూటీలను సరిగ్గా నిర్వర్తిస్తే ఇలాంటి ఇబ్బందులు ఎదురుకావని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు విధులను సక్రమంగా నిర్వర్తించి తమను అన్యాయం జరుగకుండా చూడాలని పలువురు షాపు యజమానులు కోరుతున్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

ఐనవోలు, డిసెంబర్ 8 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పంథిని శివారు చింతకుంట క్రాస్ మీదుగా అక్రమంగా రేషన్ సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనుమతులు లేకుండా ఆటోలో తరలిస్తున్న సుమారు 40 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యం విలువ సుమారు రూ.4,800 ఉంటుందని చెప్పారు.

## యువతి, మహిళ అదృశ్యం

మడికొండ, డిసెంబర్ 8 : యువతి అదృశ్యమైన ఘటనపై మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. కడిపికొండకు చెందిన సయ్యద్ కమరున్నీసా చిన్న కూతురు జేబాఫాతిమా పరీక్ష రాసేందుకు శనివారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో ఆదివారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. యువతి ఇంటి నుంచి వెళ్లేటప్పుడు పసుపు రంగు పంజాబీ డ్రెస్ వేసుకొందని, ఆచూకీ తెలిసిన వారు మడికొండ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. అలాగే కడిపికొండ ఇందిరమ్మ కాలనీకి చెందిన రాగుట్ల శంకర్ తన భార్య నాగమణి ఆరు నెలల కిందట పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఈ రోజు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినట్లు సీఐ తెలిపారు.

## అంబేద్కర్‌కు జ్ఞానమాల అంకరణ

అంబేద్కర్ జ్ఞాన మాల అంకరించిన పరిరక్షణ సమితి సభ్యులు

నయీంనగర్, డిసెంబర్ 8 : హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లోని భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ సమితి ఆదివారం శుభ్రం చేసి జ్ఞానమాల అలంకరించారు. కార్యక్రమంలో సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బండి అశోక్, న్యాయవాది మోహన్, వివిధ సంఘాల నాయకులు రజినీకుమార్, శ్రీనివాస్, శ్రావణ్, సాదు కుమార్, విక్రమ్, నాగులు, రమేశ్, నర్సింహ పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ సమ్మిరెడ్డి

## ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో శ్రీనివాస్ ప్యానల్ విజయం

నయీంనగర్, డిసెంబర్ 8 : ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో చాగంటి శ్రీనివాస్ ప్యానల్ అన్ని పోస్టుల్లో ఘన విజయం సాధించింది. అధ్యక్షుడిగా పెద్ది ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్ రావు, రఘురాం, నజీమ్, సదాశివ, రాము, కార్యదర్శిగా చాగంటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా ఉపేందర్, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా వేణుగోపాల్, అభినవ్, వినయ్ కుమార్, బస్వరాజు శ్రీమాన్, ఇనాయత్ గెలుపొందారు. సభ్యులకు రిటర్నింగ్ ఆఫీసర్ గోపు సమ్మిరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.

## క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి

**డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి**

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి

వరంగల్, డిసెంబర్ 8 : సీఎం కప్-2024 పోటీలకు వరంగల్, ఖిలా వరంగల్ మండలాల పరిధిలోని 14 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని గ్రేటర్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. వరంగల్ మండల పరిధిలోని వారు ఓ సిటీ గ్రౌండ్, ఖిలా వరంగల్ మండల పరిధి క్రీడాకారులు ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ మైదానంలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 9న పేర్లు నమోదు చేసుకొని 10 నుంచి 12 తేదీ వరకు జరిగే వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ, యోగ, అథ్లెటిక్స్, ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం పోటీల నిర్వహణపై ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి రవి

శాయంపేట, డిసెంబర్ 8 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సమావేశం మంద భద్రయ్య అధ్యక్షతన వసంతాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన మాట ఉత్తదేనా అని ప్రశ్నించారు. ప్రజా పాలన ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేయడం సిగ్గుచేటు అన్నారు. 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి అరకొరగా అమలు చేసి ఇదే గొప్ప ప్రజా పాలన అంటూ ప్రచార ఆర్భాటం చేయడం సరికాదన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పి 3వేల బస్సు సర్వీసులను రద్దు చేశారని, ఇదేనా మహిళా సంక్షేమం అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు సోమవారం ధాన్య కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, సహాయ కార్యదర్శి నీల రవీందర్, కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి పాల్గొన్నారు.

## గురుకుల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వీడాలి

మాట్లాడుతున్న బైరపాక ప్రశాంత్

నయీంనగర్, డిసెంబర్ 8 : గురుకుల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వీడాలని కేయూ అధ్యక్షుడు, గురుకుల బాట ఇన్‌చార్జి బైరపాక ప్రశాంత్ అన్నారు. కేయూలో హనుమకొండ, వరంగల్ గురుకుల బాట బాధ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురుకుల బాట కార్యక్రమం నవంబర్ 30వ తేదీ నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు నిర్వహించామన్నారు. గురుకులాల్లో ఉన్న అనేక సమస్యలను గుర్తించామని, వివరాలను నివేదిక రూపంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో వేసిన కమిటీకి అందజేస్తామన్నారు. ఈ విద్యాసంవత్సరం మొదలై ఆరు నెలలు గడుస్తున్న ఇప్పటికీ హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, బెడ్‌షీట్స్, డ్రెస్సులు రాష్ట్ర ప్రభుత్వం అందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. చలికాలంలో కనీసం దుప్పట్లు ఇవ్వకుండా పేద విద్యార్థులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడం సరి కాదని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తే ఇప్పుడు దొడ్డుబియ్యం పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వ దృష్టి సారించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్ చంద్ర, రాకేశ్, నాగరాజు, వీరస్వామి, అనిల్, అశోక్, రాజేశ్, వినయ్, ముదుసాని సిద్ధు పాల్గొన్నారు.

## రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

వరంగల్, డిసెంబర్ 8 : రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పులి సారంగపాణి అధ్యక్షతన రిటైర్డ్ కళాశాల అధ్యాపకుల సంఘ సమావేశం జరిగింది. అతిథులుగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్యనారాయణరావు, సలహాదారులు సుధాకర్‌రెడ్డి, అంపశయ్య నవీన్ హాజరయ్యారు. మల్లారెడ్డి కార్యదర్శి నివేదిక, రాజయ్య ఆర్థిక నివేదిక సమర్పించారు. అనంతరం 2025-26 సంవత్సరానికి అధ్యక్షుడిగా పులి సారంగపాణి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శిగా మాల్లారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రాజయ్య, సంయుక్త కార్యదర్శులుగా జిన్నా ప్రభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా 20 మందిని ఎన్నుకున్నారు.

ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారులు

## ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

న్యూశాయంపేట, డిసెంబర్ 8 : హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో పరశురాం దళ్ ఆధ్వర్యంలో అలివేలు మంగ, పద్మావతీ సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోదరుడు వద్దిరాజు వెంకటేశ్వర్లు సౌజన్యంతో ప్రముఖ కృష్ణ యజుర్వేద పండితుడు గుద్దిమల్ల విజయ్‌కుమార్, చిమిరాల శ్రీధర్, కలకుంట్ల మెగా శ్యామ్, భూరు శ్రీవర్ధన్, భూరు శ్రీమానాచార్యులు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పరశురామ్ దళ్ జిల్లా అధ్యక్షుడు ముదిగంటి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ పాల్గొన్నారు.

## జమ్మికుంటలో ఏడేళ్ల క్రితం బైక్ మాయం

**ప్రస్తుతం కాజీపేటలో బైక్‌పై ట్రాఫిక్ చలాన్లు**

కాజీపేటలో చలాన్ పడిన బైక్

కాజీపేట, డిసెంబర్ 8 : జమ్మికుంటలో ఏడేళ్ల క్రితం మాయమైన ఓ బైక్‌పై ప్రస్తుతం కాజీపేటలో ట్రాఫిక్ చలాన్ల పడుతున్న ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. జమ్మికుంటకు చెందిన రొడ్డ శారద-నరేందర్ దంపతులు జమ్మికుంట రైల్వేస్టేషన్ బైక్ పార్కింగ్ స్టాండ్ నడిపించారు. ఆ స్టాండ్‌లో ఏడేళ్ల క్రితం మర్రిపల్లిగూడేనికి చెందిన ఇనుగాల శ్రావణ్ కుమార్ తన బైక్‌ను పార్కింగ్ చేసి ఊరికెళ్లాడు. ఊరి నుంచి తిరిగి వచ్చే సరికి రైల్వే పార్కింగ్ స్టాండ్‌లో బైక్ కనిపించలేదు. స్టాండ్ నిర్వాహకులు, శ్రావణ్‌కుమార్ బైక్ కోసం జమ్మికుంట పరిసరాల్లో ఎంత వెదికినా కనిపించలేదు. దీంతో కొన్ని రోజుల తర్వాత స్టాండ్ నిర్వాహకులు శ్రావణ్‌కుమార్‌కు కొత్త బైక్ కొనిచ్చారు. కాగా, పది నెలలుగా శ్రావణ్ కుమార్‌కు తన పాత బైక్ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు కాజీపేటలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి తొమ్మిది చలాన్లు వచ్చాయి. దీంతో శ్రవణ్‌కుమార్ జిమ్మికుంట రైల్వే స్టాండ్ నిర్వాహకులు శారదకు సమాచారం ఇచ్చాడు. శారద అక్టోబర్ 14న కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించారు. ప్రస్తుతం ఆ బైక్ కాజీపేట పట్టణంలోనే తిరుగుతున్నదని, ట్రాఫిక్ చలాన్లు అన్ని పట్టణంలోని ఫాతిమా బ్రిడ్జి ప్రాంతం నుంచి వచ్చాయని పోలీసులు చెప్పారు.

సహాయ చర్యలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

లక్ష్మయ్య(ఫైల్)

## కారును తప్పించబోయి చెట్టును ఢీకొన్న డీసీఎం

**డీసీఎం వ్యాన్ డ్రైవర్ మృతి**

ఐనవోలు, డిసెంబర్ 8 : ఎదురుగా వచ్చే కారును తప్పించబోయి అదుపు తప్పి డీసీఎం చెట్టును ఢీకొట్టగా డ్రైవర్ మృతి చెందిన ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరం శ్యాంసుందర్ కుటుంబ సభ్యులతో కలిసి హనుమకొండ నుంచి కొడకండ్లకు కారులో వెళ్తున్నాడు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై పంథిని గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద బైక్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న డీసీఎం సైడ్‌కు తగిలి బైక్‌ను ఢీకొట్టాడు. సూర్యాపేట నుంచి పత్తి లోడ్‌తో వరంగల్ మార్కెట్‌కు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ ఎదురుగా ఒక్కసారిగా మీదకు వచ్చిన కారును గమనించి ప్రమాదాన్ని నివారించేందుకు డీసీఎంను ఎడమవైపుకు తిప్పాడు. దీంతో స్పీడ్ కంట్రోల్ కాక రోడ్డు పక్కనే ఉన్న చింతచెట్టును ఢీకొట్టాడు. దీంతో డీసీఎం డ్రైవర్ మేముల లక్ష్మయ్య(48) స్టీరింగ్, క్యాబిల్ భాగం మధ్యలో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై పస్తం శ్రీనివాస్ పోలీసులు సిబ్బందితో ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకొని డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను జేసీబీ సహాయంతో బయటికి తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్యయ్య మృతి చెందాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహదారుడు గోగుల రవీందర్, కారులో ప్రయాణణిస్తున్న పేరం శ్యాంసుందర్‌కు గాయాలయ్యాయి. సుమారు గంటపాటు రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని తన సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

## నేడు బల్దియా గ్రీవెన్స్

వరంగల్, డిసెంబర్ 8 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌లో వినతులు అందజేయాలన్నారు. అధికారులు సకాలంలో గ్రీవెన్స్‌కు హాజరుకావాలని కోరారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

## పరకాలను అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే రేవూరి

పరకాల, డిసెంబర్ 8 : పరకాల పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్, కూరగాయల మార్కెట్, భూపాలపల్లి రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో స్థానికులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతలు కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామన్నారు.

108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

## అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట, డిసెంబర్ 8 : శాయంపేట పీహెచ్‌సీలో నూతనంగా ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్‌ను ఆదివారం సాయంత్రం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. అంబులెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగ